దళారుల అడ్డాగా దమ్మపేట రెవెన్యూ ఆఫీస్!

- మంత్రి హెచ్చరించినా మారని ఉద్యోగుల తీరు
- సెలవులో వెళ్లిన తహసీల్దారు
- చెలరేగిపోతున్న పైరవీకారులు

దమ్మపేట, డిసెంబర్ 29 : దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయం దళారులకు అడ్డాగా మారింది. సర్వేయర్ వెంకటరత్నం రూ.50 వేలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీ అధికారులకు పట్టుబడటం సంచలనంగా మారింది. కీలకమైన పట్టాదారు పాస్ పుస్తకాల విషయంలో దళారులు రైతుల వద్దకు గద్దల్లా వాలిపోతుంటారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో గిరిజనుల పేరుతోనే భూముల క్రయవిక్రయాలు జరపాల్సి ఉండటం, ఆస్తుల బదలాయింపు, గిరిజన గిరిజనేతరుల మధ్య భూ తగాదాల పరిష్కారం తదితర అంశాల్లో దళారులు రైతుల తరపున రెవెన్యూ అధికారులతో సెటిల్‌మెంట్లు చేస్తూ లక్షల రూపాయలు గుంజుతున్నారని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. నిరుపేద రైతులు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరగలేక దళారులనే ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో దళారులు వీరిని ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని రాజకీయ నాయకులు తహసీల్దారు కార్యాలయమే అడ్డాగా కార్యకలాపాలు సాగిస్తున్నారు.

మందలపల్లి గుట్టను పట్టించుకోరా?

మండలంలోని మందలపల్లి గ్రామ శివారులో ఉన్న మట్టి గుట్టను కొందరు అక్రమార్కులు జేసీబీల సహాయంతో యథేచ్ఛగా తవ్వేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం రెవెన్యూశాఖ అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆ గుట్ట అక్రమార్కుల చేతిలో కరిగిపోయింది. కొందరు రెవెన్యూశాఖలో పనిచేసే వ్యక్తుల సహాయంతోనే మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విధంగా తవ్వకాలు జరగడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది.

సెలవుపై వెళ్లిన తహసీల్దార్..

దళారులు తలనొప్పిగా మారారు. కొందరు నేరుగా రెవెన్యూ సిబ్బందిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో

మందలపల్లి వద్ద గుట్టను తవ్వేసిన దృశ్యం

తహసీల్దారు సీహెచ్ నరేష్ ఈ నెల 7వ తేదీన సెలవుపై వెళ్లారు. దీంతో డిప్యూటీ తహసీల్దారు వాణి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సిబ్బందిని గట్టిగా హెచ్చరించినా సిబ్బంది తీరు మారకపోవడం గమనార్హం.

భక్తులతో కిక్కిరిసిన భద్రాద్రి రామాలయం

రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

భద్రాచలం, డిసెంబర్ 29 : భద్రాచలం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. రామాలయంతోపాటు దేవస్థానం కాటేజీలు, సత్రాలు, వసతి సముదాయాలు, పట్టణంలోని ప్రైవేటు లాడ్జీలన్ని నిండిపోయాయి. పాపికొండల విహార యాత్రకు 20కి పైగా లాంచీల్లో పర్యాటకులు బయలుదేరి వెళ్లారు. భద్రాచలంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు చేసి రామాలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆర్జిత సేవలు అధికంగా ఉండడంతో ఉచిత దర్శన భక్తులకు మూడు గంటలకు పైగా సమయం పట్టింది. రూ.100, రూ.300 టికెట్లపై సైతం భక్తులు ఎక్కువ సేపు క్యూలైన్లలో వేచి ఉన్నారు.

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తులతో నిండిన ఉచిత దర్శన క్యూలైన్లు

రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

స్వామివారికి ఆదివారం ఆర్జిత సేవల్లో భాగంగా అంతరాలయంలో అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంలో స్వామివారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. నిత్యకల్యాణల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తునికి చెందిన పాలపర్తి దాలి నాయుడు, డాక్టర్ గోళ్లభూపతిరావులు కుంచల దండను అందజేశారు.

మల్లాయిగూడెంలో సోలార్ వెలుగులు

చీడపీడలు ఆశించకుండా రైతులకు మేలు

సోలార్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో (ఫైల్)

అశ్వారావుపేటరూరల్, డిసెంబర్ 29 : మండల పరిధిలోని మల్లాయిగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ ట్రాపులు వెలుగులు జిగేలుమనిస్తున్నాయి. అదే గ్రామానికి చెందిన సారిన కాంతమ్మ కూరగాయల పంటలో చీడపీడలు ఆశించకుండా ఏర్పాటు చేసిన సోలార్ ట్రాప్‌ను ఇటీవల ఆ గ్రామంలోని జీవ ప్రాజెక్టు క్షేత్రాలను సందర్శించిన ఐటీడీఏ పీవో రాహుల్ దాని పని విధానం గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా జీవప్రాజెక్టు వారు వాసన్ పర్యవేక్షణలో బేతి శివకాంత్ వ్యవసాయ క్షేత్రంలో రూ.1,500 విలువ చేసే సోలార్ ట్రాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ వెలుగు వద్దకు ఆకర్షితమై క్రిమికీటకాలు వచ్చి చనిపోతున్నాయి. ఇలా చీడపీడలు, క్రిమి కీటకాల నుంచి రక్షణ పొందుతున్నట్లు శివకాంత్ తెలిపారు. రసాయనిక మందులు వినియోగిస్తే అధిక ఖర్చు అవుతుందని వివరించారు. సోలార్ ట్రాప్‌లు కొత్తగా కనిపిస్తుండడంతో రైతులు వచ్చి వింతగా పరిశీలిస్తున్నారు.

భద్రాద్రిలో నెహ్రూకప్ పోటీలు ప్రారంభం

ప్రసంగిస్తున్న పాకాల దుర్గాప్రసాద్

భద్రాచలం, డిసెంబర్ 29 : భద్రాచలంలో 29వ అంతర్రాష్ట్ర నెహ్రూకప్ క్రికెట్ పోటీలను ఆదివారం ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 ఏళ్లుగా నెహ్రూకప్ నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ పోటీలకు ప్రభుత్వ అధికారిక గుర్తింపు తెచ్చేందుకు ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ముమ్ముందు కూడా ఈ పోటీలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ ప్రాంత యువత క్రికెట్‌లో జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో ఆడుతుండటం గొప్ప విశేషమన్నారు. ట్రోఫీకి ఆర్థిక సహాయ సహకారాలను అన్నివిధాలుగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి ట్రస్ట్ సభ్యుడు వల్లూరుపల్లి వంశీ, టీడీపీ నాయకులు ఎస్కే అజీమ్, టోర్నీ నిర్వాహకులు తోటమల్ల బాలయోగి, సురేష్‌బాబు, అట్లూరి శ్రీధర్, గుమ్ములూరి శ్రీనివాసరావు, పూనెం ప్రదీప్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమ్మెతో విద్యార్థులకు నష్టం

సమావేశంలో మాట్లాడుతున్న వంశీ

చంద్రుగొండ, డిసెంబర్ 29 : సమగ్ర శిక్ష(ఎస్ ఎస్ఏ) ఉద్యోగుల సమ్మె వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. ఆదివారం చంద్రుగొండలో ఏర్పాటు చేసిన విద్యార్థి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నాయని, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేకుంటే విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు'

మాట్లాడుతున్న జూపెల్లి దుర్గాప్రసాద్

పాల్వంచ, డిసెంబర్ 29: విద్యార్థుల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్‌వీ పట్టణ కమిటీ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. పాల్వంచలో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ సర్కారు నెరవేర్చలేదని విమర్శించారు. మెస్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు అఖిల్, దీపక్, మెహతాబ్, సోను, మీరావలి, ముసమీర్, సలీం, రామారావు పాల్గొన్నారు.

రాధాకృష్ణ కోలాటం బృందం వార్షికోత్సవం

వార్షికోత్సవంలో పాల్గొన్న కోలాటం సభ్యులు

లక్ష్మీదేవిపల్లి, డిసెంబర్ 29: రాధాకృష్ణ కోలాట బృందం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మండలంలోని ప్రశాంతి నగర్‌లో ఆదివారం పదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. బృందం సభ్యులు పద్మ, అనిత, స్వరూప ఆధ్వర్యంలో ఈ సంబురాలను నిర్వహించారు. గురువు వాసు లక్ష్మీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోలాట బృంద సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సీఆర్‌టీల వినతి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, డిసెంబర్ 29 : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్టు ఉపాధ్యాయుల పరిష్కరించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు సీఆర్‌టీల బృందం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుగులోతు రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మధు పరామర్శ

నివాళి అర్పిస్తున్న తాతా మధు

జూలూరుపాడు, డిసెంబర్ 29: మండలంలోని మాచినేనిపేట తండాకు చెందిన బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు మాతృమూర్తి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గిరిబాబు కుటుంబాన్ని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆదివారం పరామర్శించారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు కృష్ణమూర్తి, చావా వెంకటరామారావు, యదళ్లపల్లి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నమెంట్

పాల్గొన్న క్రీడాకారులు

పాల్వంచ, డిసెంబర్ 29: వాసు-హర్ష మెమోరియల్ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి గ్రౌండ్‌లో ముగిసింది. ఇల్లెందు, చర్ల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బహుమతులను కేటీపీఎస్ ఏడవ దశ సీఈ వెంకటేశ్వరరావు ప్రదానం చేశారు. కేటీపీఎస్ ఏడో దశ స్పోర్ట్స్ సెక్రటరీ మహేష్ వాసు, నిర్వాహకులు ప్రవీణ్, సంజయ్, కచ్చా రామకృష్ణ పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో న్యాయచైతన్య సదస్సు

మాట్లాడుతున్న జడ్జి సూరిరెడ్డి

మణుగూరు టౌన్, డిసెంబర్ 29 : బీటీపీఎస్‌లో ఆదివారం న్యాయచైతన్య సదస్సు జరిగింది. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కంబపు సూరిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీటీపీఎస్ సీఈ బుచ్చన్న, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి ఎంవీ ప్రసాద్, మణుగూరు బార్ అధ్యక్షుడు మేదర మెట్ల శ్రీనివాస్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చిపంట సాగుపై అవగాహన తప్పనిసరి

మాట్లాడుతున్న ఏడీఏ లాల్‌చందు

టేకులపల్లి, డిసెంబర్ 29 : మిర్చి పంట సాగుపై రైతులు, డిస్ట్రిబ్యూటర్లు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు ఏడీఏ లాల్‌చందు అన్నారు. ఆదివారం టేకులపల్లి మండలం తొమ్మిదోమైలుతండా గ్రామంలో ఐఎస్‌పీ ఇన్వెంటివ్ సీడ్స్ ఆధ్వర్యంలో మిరపక్షేత్ర ప్రదర్శన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ మిర్చిపంట సాగు విషయంలో రైతులు, డీలర్లు అవగాహన కలిగి ఉండాలని, విత్తనాలను ఎంపిక విషయంలో నాణ్యమైన విత్తనాలు ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ బాలూనాయక్, సదానందం, రవి, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు నష్టపరిహారం అందించాలి

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 29 : ఇల్లెందు ఏరియా ఎస్అండ్‌పీసీలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు నష్టపరిహారం అందించాలని సీఐటీయూ నాయకులు అబ్దుల్‌నబీ అన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, ప్రేమ్, మల్లయ్య, రాజేష్, శ్రీనివాస్, ప్రేమ్ సింగ్ పాల్గొన్నారు.

ముక్కోటి వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పర్ణశాల, డిసెంబర్ 29 : పర్ణశాల క్షేత్రంలో జరిగే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా జనవరి 9వ తేదీన జరిగే తెప్పోత్సవం, 10వ తేదీన ఉత్తర ద్వార దర్శనంకు భక్తులను ఆహ్వానిస్తూ గోడపత్రికలను ఈవో రమాదేవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, కిషోర్, పర్యవేక్షణ పర్ణశాల ఆలయ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 29 : క్వార్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఇల్లెందు ఏరియా సింగరేణి ఉద్యోగులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం ఎస్‌వోటూజీఎం కార్యాలయంలో కౌన్సిలింగ్‌లో ప్రెష్ ఎలాట్‌మెంట్ బి టైప్ క్వార్టర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించారు. ఎస్‌వోటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి క్వార్టర్ ఎలాట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేయబడుతాయన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ జి వీరన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

సన్మానం చేస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 29 : ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇల్లెందు ఏరియా సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌లో అంకితభావంతో పనిచేసిన రాందాస్, సుందర్, వెంకటేశ్వర్లు అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సూపరింటెండెంట్ రామకృష్ణ, ఫిట్ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు, ఎండీ అన్వర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజావాణి'

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 29: ఈ నెల 30న సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

పాల్వంచ, డిసెంబర్ 29: పాత పాల్వంచకు చెందిన శతాధిక వృద్ధుడు షేక్ పీర్ సాహెబ్(104) ఆదివారం మృతిచెందాడు. ఆయన వృత్తిరీత్యా రైతు. ఆయనకు ఇప్పటి వరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని కుటుంబీకులు తెలిపారు.

రేపు ఆసుపాకలో గ్రామసభ

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 29 : మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించటానికి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీవో ప్రసాదరావు ఆదివారం తెలిపారు. సోమవారం ఆసుపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఉంటుందన్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈయన వెంట కార్యదర్శి మోతీలాల్ ఉన్నారు.

మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

పాల్వంచ, డిసెంబర్ 29: పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తనను గెలిపిస్తే పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపిస్తానన్న హామీని ఎమ్మెల్యే విస్మరించారని విమర్శించారు. నాయకులు శనిగరపు నిరంజన్‌రావు. రంజిత్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల మెరుపు సమ్మె

మణుగూరు టౌన్, డిసెంబర్ 29 : భద్రాద్రి పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆదివారం మెరుపు సమ్మెకు దిగారు. సోమవారం నుంచి తమకు వేతనాలు అందే వరకు నిరసన తెలియజేస్తామన్నారు. బిల్లులు రాక కాంట్రాక్టు కార్మికులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్లు అప్పులు చేసి జీతాలు ఇచ్చినా సరే సాధ్యం కావడంలేదని వాపోతున్నారు. బీటీపీఎస్‌లో వేతనాలు లేక రోజువారి జీవితం గడపలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందికి గురవుతున్నామని కార్మికులు తెలుపుతున్నారు. పెరుగుతున్న ధరలు ఒకవైపు వేతనాలు రాక తీవ్ర అప్పుల్లో కూరుకుపోయామని కాంట్రాక్టు కార్మికులు తెలుపుతున్నారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు నాలుగునెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

బూర్గంపహాడ్, డిసెంబర్ 29: మండలంలోని కృష్ణసాగర్ శివారులో కొందరు వ్యక్తులు నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని.. ఆరు బైకులను, ఆరు కోడి పుంజులను, సుమారు రూ.17 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్ఐలు ప్రవీణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలో వారం రోజులు గడవకముందే టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండోసారి మెరుపు దాడులు నిర్వహించడం గమనార్హం.

డైరీ ఆవిష్కరణ

భద్రాచలం, డిసెంబర్ 29 : ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ 2025 నూతన డైరీ, క్యాలెండర్‌ను భద్రాచలంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కేఎస్ఎల్‌వీ ప్రసాద్, డి.కృష్ణమూర్తి, సత్యనారాయణ, సుబ్బయ్యచౌదరి, రాజబాబు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.

NT-338986-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.